క్లుప్తంగా

కలెక్టర్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: ఎమ్మెల్యే కోవ లక్ష్మి శనివారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పూలమొక్క అందజేశారు. ఆమె వెంట సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా భీమన్న జాతర



జాతరలో భక్తుల సందడి

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని మాలన్ గొంది గ్రామంలో భీమన్న దేవుని జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో భీమన్న దేవునికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ మూడు సంవత్సరాలకోసారి నిర్వహించే జాతరకు ఉమ్మడి జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరవుతారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు టేకం గంగు, భీము, చిన్ను, బుక్య రవీందర్, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి'



విద్యార్థినితో చదివిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని ఇంద్రానగర్, ఏసాపూర్, అంతాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులతో చదివించారు, రాయించారు. సామర్థ్యాల ఆధారంగా విద్యాబోధన చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలని, ప్రతీ వారంలో మూడు గుడ్లు ఇచ్చేలా చూడాలన్నారు.

నేడు క్యాలెండర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి చౌరస్తాలోని మున్నూరు కాపు సంఘ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కలికోట రమణయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ దండె విఠల్ హాజరవుతారని, అధిక సంఖ్యలో కులస్తులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పెంచికల్‌పేట్: ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై కొముురయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు శనివారం అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు లైసెన్సు, ఆర్‌సీ, ఇన్సురెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేపడుతున్న కార్మికులు

కాగజ్‌నగర్‌రూరల్: తమకు రావాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. తమకు ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, రూ. 2 కోట్ల పీఎఫ్ డబ్బులు చెల్లించాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తూనే ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు శంకర్, సంజీవ్, మల్లేశ్, రమేశ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) తహసీల్దార్ కార్యాలయం



సిర్పూర్(టి) మండలంలోని రాంబండ రైల్వే బ్రిడ్జి





సిర్పూర్(టి) గ్రామ శివారులోని రైల్వే వంతెన

చెక్కు చెదరని ఆనవాళ్లు..!

జిల్లాలో నిజాం కాలంలో నిర్మించిన కట్టడాలు నేటికీ చెక్కు చెదరకుండా దర్శనమిస్తున్నాయి. నిర్మించి వందేళ్లు దాటినా నేటికీ వినియోగంలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదటి సారిగా ఖాజీపేట్ -బల్లార్షా రైల్వేలైన్ పనులను నిజాం కాలంలో చేపట్టారు. 7వ నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 16, డిసెంబర్, 1928న ఆసిఫాబాద్ రోడ్(రెబ్బెన) రైల్వేస్టేషన్‌లో రైల్వేలైన్ పనులకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరించారు. ఆసిఫాబాద్ రోడ్(రెబ్బెన), కాగజ్‌నగర్, సిర్పూర్(టి) తదితర రైల్వేస్టేషన్‌లతో పాటు రైల్వేలైన్‌లో నిర్మించిన రైల్వే వంతెనలు చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. సిర్పూర్(టి) శివారులో ఉన్న రెండు రైల్వేవంతెనలతో పాటు రాంబండ రైల్వే వంతెనపై నుంచి నేటికీ రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. నిజాం కాలంలో నిర్మించిన సిర్పూర్(టి) తహసీల్దార్ కార్యాలయం చరిత్రకు సాక్ష్యంగా ఉంది. నిజాం కాలంలో నిర్మించిన రైల్వే వంతెనలతో పాటు ఇతర భవనాలు, పురాతన కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు. – సిర్పూర్(టి)



ఖాజీపేట్ -బల్లార్షా రైల్వేలైన్ ప్రారంభోత్సవ శిలాఫలకం

పచ్చని శోభకు సన్నద్ధం

- గ్రామాల్లో నర్సరీల ముస్తాబు
- వనమహోత్సవానికి పెంచనున్న మొక్కలు
- 3.40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ముమ్మరంగా సాగుతున్న పనులు



కెరమెరిలోని నర్సరీ

కెరమెరి: పల్లెల్లో పచ్చదనం పరిఢవిల్లేందుకు నర్సరీలు ముస్తాబవుతున్నాయి. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకానికి ఇప్పటి నుంచే అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పెద్ద మొత్తంలో మొక్కలు నాటేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీల్లో ఎక్కడెక్కడ, ఎన్ని మొక్కలు, ఎలాంటి మొక్కలు నాటాలో ఇప్పటికే గుర్తించారు.

3లక్షల40వేల మొక్కలు..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 31 నర్సరీలను ఏర్పాటు చేశారు. ఆయా నర్సరీల్లో 3 లక్షల 40 వేల మొక్కలను నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. కెరమెరి, ఆగర్‌వాడలో గ్రామ పంచాయతీల్లో 30 వేలు, జోడేఘాట్‌లో 30 వేలు మిగలిన 28 పంచాయతీల్లో 10 వేల చొప్పున మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. బ్యాగ్ ఫిల్లింగ్ (కవర్లలో మట్టి నింపడం), నారుమళ్ల తయారీ జరుగుతున్నాయి. అయితే వీటిలో రెండు పాళ్లు ఎర్రమట్టి, ఒక పాలు చెరువు మట్టి, మరోపాలు పశువుల పేడ, మూడింటి మిశ్రమాన్ని జల్లెడ పట్టి అనంతరం పాలిథీన్ కవర్లలో మట్టి నింపుతున్నారు. ఈ ప్రక్రియ మండలంలోని అన్ని జీపీల్లో కొనసాగుతోంది. వరుస వరుసకు 0.4 మీటర్ల దూరం ఉండేలా చూస్తున్నారు.



పాలిథీన్ కవర్లలో మట్టి నింపుతున్న కూలీలు

కూలీల కలుపు తీయడానికి, నీరు పట్టడానికి అనువుగా మధ్యలో దూరం ఉండేలా చూస్తున్నారు.

ఒక్కో కూలీకి రూ.300

నర్సరీలో పని చేసే వారికి ప్రతీరోజు రూ.260 కూలీ పడుతుంది. ఒక్కో కూలీ 250 పాలిథీన్ కవర్లను నింపుతున్నారు. మండలంలోని 40 శాతం మొక్కలను ఎవెన్యూ ప్లాంటేషన్ (రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం), 10 శాతం పూల మొక్కలు, 30 శాతం టేకు మొక్కలు, 10 శాతం పండ్ల మొక్కలు, 10 శాతం ప్రోటాన్, మరో 10 శాతం ఇతర మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వనమహోత్సవం నర్సరీలు కొనసాగుతున్నాయి. నర్సరీల నిర్వాహకులకు ఎప్పటికప్పుడు ఈజీఎస్ టీఏ, ఎఫ్‌ఏల సహాయంలో అవగాహన కల్పిస్తున్నాం. నర్సరీలను పకడ్బందీగా నిర్వహిస్తాం. కూలీ రోజుకు రూ.300 సంపాదించగలగాలి.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో

యువత ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజలు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో పరమహంస సద్గురు పూలాజీబాబా ధ్యానమందిర 17వ వార్షిక మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూలాజీబాబా అడుగుజాడల్లో ఆధ్యాత్మిక బాట పట్టాలన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు బికాస్ ఘరామి, హన్మంతు, చందు, తిరుపతి పాల్గొన్నారు.

'బకాయిలు చెల్లించి రుణాలు తీసుకోవాలి'



ఆర్‌ఎంకు బకాయిలు చెల్లిస్తున్న వీవో సభ్యులు

కెరమెరి: గతంలో తీసుకున్న రుణ బకాయిలను చెల్లిస్తే నూతన రుణాలు అందిస్తామని స్త్రీనిధి ఆర్ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కెస్లాగూడలో బాబా వీవో నుంచి రూ. 66వేల పాత బకాయిలను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల్లో సభ్యులు అధిక పొదుపు చేస్తే రానున్న రోజుల్లో బ్యాంకులు అధికంగా రుణాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. మొండి బకాయిలు ఉంటే వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ పథకాలను ప్రారంభించి మహిళ సాధికారతకు పాటుపడుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట స్త్రీనిధి మేనేజర్ హొక్టు, ఏపీఎం జగదీశ్వర్, సీసీ సంజీవ్ తదితరులు ఉన్నారు.

'రక్తదానం ప్రాణదానంతో సమానం'



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న సీఐ రమేశ్

కౌటాల: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని కౌటాల సీఐ ముత్యం రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనంలో జగద్గురు రామానందాచార్య దక్షిణ్ పీఠం నాణీజ్‌ధామ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర బాబాకు ప్రత్యేక పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన 18 నుంచి 55 ఏళ్లలోపు వారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయాలన్నారు. రక్తదాతలు రక్తం అందిస్తేనే రక్తం అవసరం ఉన్న వారికి అందుతుందన్నారు. రక్తహీనతతో అనేక మంది బాధపడుతున్నారని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులకు రక్తం దొరకడం లేదన్నారు. ఆరోగ్యవంతులైన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. మహిళలు అధిక సంఖ్యలో రక్తదానం చేయడం మంచి విషయమన్నారు. దాతల నుంచి సేకరించిన రక్తం ఆర్మీ సంస్థలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 50 మంది నుంచి రక్తం సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు దిలీప్, పండరీ, బాలాజీ, బాబాన్, రాజు, బాపురావు, సునీత, ఉష, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: మండలంలోని గోలేటి గ్రామపంచాయతీ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన పోతరాజుల రాజేంద్ర ప్రసాద్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.39వేల చెక్కును శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందన్నారు. అత్యవసర సమయంలో వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకే క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

మంచిర్యాలటౌన్: యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడు సంవత్సరాలుగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పేరిట క్రికెట్ టోర్నమెంట్‌ను మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి నిర్వహిస్తున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంచిర్యాల పట్టణంలోని శివాజీ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన అటల్ బిహారీ వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ 7వ ఎడిషన్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించగా, ముఖ్య అతిథిగా సిర్పూర్ ఎమ్మెల్యే హాజరై ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ నాయకత్వంలో ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా యువతను క్రీడల్లో ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. జిల్లాలోని యువత క్రీడల్లో రాణించేందుకు రఘునాథ్ కృషి చేయడం అభినందనీయం అని కొనియాడారు. అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువతలో క్రీడానైపుణ్యం ఉందని, క్రికెట్, కబడ్డీ టోర్నమెంటులను జిల్లాలో నిర్వహిస్తున్నామని, రాబోయే రోజుల్లో యువత కోసం వివిధ క్రీడల్లో టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. టోర్నమెంటులో మొత్తం 64జట్లు పాల్గొనగా, ఫైనల్‌లో తలపడిన మిస్టర్ ఫ్రైస్ జట్టు గెలుపొంది విన్నర్ ట్రోఫీ, రూ.15వేల క్యాష్ ప్రైజ్, రన్నర్‌గా నిలిచిన సతీశ్ స్మాషర్స్ జట్టుకు రన్నర్ ట్రోఫీ, రూ.7500ల క్యాష్ ప్రైజ్‌ను క్రీడాకారులకు అందించారు. నాయకులు వెంకటేశ్వర్‌రావు, రజనీశ్ జైన్, దుర్గం అశోక్, ముఖేశ్ గౌడ్, కృష్ణమూర్తి, రమణరావు, తిరుపతి, రమేశ్, స్వామిరెడ్డి, సంజీవ్, మురళి, జయరామ రావు, మల్లేశ్, రాకేశ్ రెన్వా, అశోక్ పాల్గొన్నారు.

జీసీసీ మేనేజర్ సస్పెన్షన్!

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జీసీసీ మేనేజర్ బొజ్జనాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కాగజ్‌నగర్ జీసీసీకి ఇన్‌చార్జిగా బొజ్జనాయక్ కొనసాగుతున్నారు. ఇటీవల జీసీసీ సరుకులను కాగజ్‌నగర్‌లోని డాడానగర్‌లో ఓ ప్రైవేటు వ్యక్తి ఇంట్లో దింపుతుండగా కొందరు యువకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో విచారణలో రుజువు కావడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కౌటాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ లక్ష్యమని జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉప్పుల నరసింహచారి అన్నారు. శనివారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, 317 జీవో బాధితుల సమస్యను పరిష్కరించాలన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నారాయణ సింగ్, రాజు, గణపతి, సంధ్యారాణి, సత్యనారాయణ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

చింతలమానెపల్లి: టీఎస్‌యూటీఎఫ్ 2025 క్యాలెండర్‌ను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. మండల విద్యాధికారి జయరాజ్, ఎస్సై ఇస్లావత్ నరేశ్‌ల చేతుల మీదుగా ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంఈవో, ఎస్సైలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ఉన్నతికి పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్ గౌడ్, విఘ్నేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతలతో తిప్పలు..!



దహెగాం: మండల కేంద్రం నుంచి లగ్గాం వరకు రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు సంవత్సరాల క్రితం వేసిన బీటీ రోడ్డుపై మూడు కిలోమీటర్ల మేర పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకంగా ఉంటుందని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు కిలోమీటర్ల ప్రయాణానికి సుమారు 15నిమిషాల సమయం పడుతుందని వాపోతున్నారు. గుంతల రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'గిరిజనులకు పనులు అప్పగించాలి'



పనులు అడ్డగిస్తున్న ఆదివాసీ నాయకులు

కౌటాల: గిరిజన గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను గిరిజనులకే అప్పగించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనులను ఆదివాసీ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ. 20 లక్షలకు పైచిలుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పెసా చట్టం ప్రకారం ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీలు అభివృద్ధి పనులు చేయాలన్నారు. చట్టం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులను గిరిజనేతరులకు అప్పగించడం సరైన పద్ధతి కాదన్నారు. గిరిజనులకు పనులు అప్పగించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని, ఐటీడీఏను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మ్యాటింగ్ గ్రాంటు చెక్కు అందజేత



మ్యాటింగ్ గ్రాంటు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తూ గత సంవత్సరం మార్చి 22న జీవీ సత్యనారాయణ మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు శనివారం ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ రూ.7.5లక్షల మ్యాటింగ్ గ్రాంటును ఎఫ్‌డీ రూపంలో ఆయన భార్య అనంతలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థలో విధులు నిర్వహిస్తూ దురదృష్టవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు యాజమాన్యం ఎలప్పుడూ ముందుంటుందన్నారు. సంస్థతో పాటు తోటి ఉద్యోగులు సైతం మృతి చెందిన కుటుంబానికి అండగా నిలుస్తున్నారన్నారు. సంస్థ, తోటి ఉద్యోగులు అందరి సహకారంతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు మ్యాటింగ్ గ్రాంటు అందజేస్తున్నామన్నారు. సంస్థ ద్వారా అందే మొత్తాన్ని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, కైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, డీవైపీఎం వేణు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా శనివారం మహిళా ఉపాధ్యాయులను పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్ బాబు, ఎంఈవో సుభాష్ జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సన్మానించారు. వారు మాట్లాడుతూ జ్యోతిబా సావిత్రి పూలే దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలన్నారు.

తక్షణ సాయం అందజేత

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి అటవీ ప్రాంతంలో పెద్ద పులి దాడిలో ఆవు మృతిచెందగా శనివారం యజమాని గొనె శ్రీనివాస్‌కు తక్షణ సహాయం కింద రూ.5వేలు ఎఫ్‌ఆర్‌వో ఇక్బాల్ హుస్సేన్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ పులి సంచరిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎఫ్‌ఎస్‌వో మోహన్‌రావు, ఎఫ్‌బీవోలు సంతోష్, అరుణ్‌రెడ్డి, అరవింద్ ఉన్నారు.